క్లుప్తంగా

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నవీపేట: మండలంలోని నాగేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం అలరించింది. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకాలు ఆకట్టుకున్నాయి. జిల్లా సాంస్కృతిక కోఆర్డినేటర్ అష్ట గంగాధర్ ఆలపించిన పాటలు అలరింపజేశాయి. కార్యక్రమంలో ఎంఈవో గణేశ్‌రావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ స్వరూప, ఎస్‌ఎంసీ చైర్మన్ గంగారాం, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



నవీపేట: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమ్మల కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను పఠనం చేశారు.

హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం



పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉందని ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గంగాసారం సునీల్‌రెడ్డి అన్నారు. ఫత్తేపూర్‌లో విద్యుత్ వినియోగదారులకు 'గృహజ్యోతి' జీరో బిల్లులను కాంగ్రెస్ నాయకులు ట్రాన్స్‌కో సిబ్బందితో కలిసి అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తారన్నారు. నాయకులు టీ పోచన్న, బీ ప్రవీణ్, ట్రాన్స్‌కో లైన్‌మన్ యూసూఫ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా నలంద హైస్కూల్ వార్షికోత్సవం



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ 20వ వార్షికోత్సవ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్, నరేష్, జితేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, పాఠశాల యాజమన్యాం నలంద ప్రసాద్, నలంద సాగర్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

కమ్మర్‌పల్లి: రైతు బంధు డబ్బులు ఆపి ఏసీ గదుల్లో కూర్చునే ఉద్యోగులకు ప్రభుత్వ జీతాలు చెల్లించొద్దని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, అంజాద్ సుల్తాన్ శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బంధుకు, ఉద్యోగుల జీతాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఉద్యోగుల జీతాలపై దుష్ప్రచారం చేసి ప్రజల్లో ఉద్యోగులపై వ్యతిరేకతను తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని ఆక్షేపించారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ఇప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన జెడ్పీజీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సీపీఎస్, పీఆర్సీ పాత బకాయిలు, మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం జీతాలు ఆలస్యంగా చెల్లించటం మూలంగా బ్యాంక్ రుణాలు సమయానికి చెల్లించలేక జరిమానాలు చెల్లించామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం దానిని సరిచేస్తుంటే ఇలా ప్రజలను ఉద్యోగుల పైకి ఉసిగొల్పి ప్రయోజనం పొందాలనుకోవటం బాధకరమని పేర్కొన్నారు.



సిద్ధుల గుట్టపై ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



బోధన్ చక్రేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రుద్రూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు




నందిపేటలో..



బోధన్ మండలం పెంటాకుర్దులో..

శివోహం..



కేదారేశ్వర ఆశ్రమంలో పూజలు చేస్తున్న మంగి రాములు మహరాజ్

- జిల్లాలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- శివనామ స్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ముప్కాల్‌లో పడిలేచిన మర్రిచెట్టు వద్ద..



దొంకేశ్వర్ మండలం చిన్నయానం గోదావరి వద్ద..



కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ బాలరాజేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

సాక్షి, నెట్‌వర్క్: హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ సాగిన శివనామస్మరణతో నిజామాబాద్ జిల్లాలోని శైవక్షేత్రాలు మార్మోగాయి. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివాలయాల్లో ఎటు చూసినా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న సిద్ధేశ్వర ఆలయంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, సాయి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. రుద్రూర్ మండలంలోని వీరభద్ర స్వామి, రాజరాజేశ్వర స్వామి ఆలయం, భక్త మార్కండేయ ఆలయం, కోటగిరి, పోతంగల్ మండలాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా చేపట్టారు. ముప్కాల్ మండల కేంద్రంలో పడిలేచిన మర్రిచెట్టు వద్ద, పోచంపాడ్ శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ బాలరాజేశ్వరస్వామి ఆలయం, బాలరాజేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాలరాజేశ్వరుడిని దర్శించుకొని కోడె మొక్కులు సమర్పించారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్ట, స్వయంభూ లింగేశ్వర ఆలయ, మార్కండేయ, నాగ లింగేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సిద్ధుల గుట్టపై భక్తులు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. మెండోరా మండలం వెల్కటూర్‌లోని శివాలయంలో నిర్వహించిన శివ పార్వతుల కల్యాణంలో ఎంపీ అర్వింద్ పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి ఉన్న శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తగ్గడంతో దొంకేశ్వర్, గాదేపల్లి, చిన్నయానం ప్రాంతాల్లో శివ లింగాలు బయటపడ్డాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గోదావరి తీరం వద్ద పుణ్య స్నానాలు ఆచరించి శివ లింగాలకు అభిషేకం చేశుకూరు. గంగ మట్టితో భక్తులు తయారు చేసిన శివ లింగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్మూర్, ఆలూర్ మండలంలోని శైవ క్షేత్రాలు శివ పంచాక్షరి నామంతో మారుమ్రోగాయి. నవీపేట మండల కేంద్రంతో పాటు జన్నెపల్లి, నాళేశ్వర్ గ్రామాలలోని శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నాళేశ్వర్‌లోని రాజరాజేశ్వరాలయంలో జాతర సంబరాలతో పాటు ఆర్కెస్ట్రా కార్యక్రమాలు చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోడెల మొక్కులు తీర్చుకున్నారు. బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, మున్సిపల్ చైర్మన్ దంపతులు తూము పద్మ శరత్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రెంజల్, కూనేపల్లి, సాటాపూర్, నీలా, కందకుర్తి, తాడ్‌బిలోలిలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. నందిపేటలోని కేదారేశ్వర ఆశ్రమంలో, నందికేశ్వరాలయంలో, ఉమ్మెడలోని ఉమా మహేశ్వర ఆలయంలో భక్తులు పూజలు చేశా రు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు జాగ్రత్త చర్యలు చేపట్టారు.



మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లిలో..



సిద్ధుల గుట్టపై దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రుద్రూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో..



ఆర్మూర్‌లోని నాగలింగేశ్వర ఆలయంలో..



పెర్కిట్‌లో..



నవీపేట మండలం నాళేశ్వర్‌లో కోడెలతో భక్తులు



మెండోరా మండలం పోచంపాడ్ శివాలయంలో..



బాల్కొండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

ప్రతి మహిళ గర్వపడాలి

- సన్మాన సభల్లో పలువురు ప్రజాప్రతినిధులు
- జిల్లాలో ఘనంగా మహిళా దినోత్సవం



రుద్రూర్‌లో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు



ఆర్మూర్‌లో మహిళలను సన్మానిస్తున్న సభ్యులు

ఆర్మూర్‌టౌన్/ రుద్రూర్/ పెర్కిట్/ బోధన్: అనేక రంగాల్లో మహిళలు తమ శక్తిని నిరూపిస్తున్నారని, మహిళగా ప్రతి ఒక్కరూ గర్వపడాలని పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, అధికారులు అన్నారు. జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పద్మశాలి సంఘం మహిళలను సంఘ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు మ్యాక మోహన్‌దాస్, సంఘం అధ్యక్షుడు వేముల ప్రకాశ్, కార్యదర్శి భూమేశ్వర్, అందె నాగేశ్వర్, గుడ్ల దేవేందర్, మాదాసు నర్సింహులు, ఈరవత్రి రాందాస్, రమేశ్, పొన్న ప్రవీణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ మండలంలోని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులు కేక్ కట్ చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ వెంకట్ రెడ్డి, ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్ ఇన్‌చార్జి సప్రీన్, అధ్యాపకులు పాల్గొన్నారు. బొప్పాపూర్‌లో గ్రామ మహిళలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, పట్ల సురేశ్, నడిపింటి నగేశ్, దువ్వ రవి, కుర్మాజీ సాయిలు, సుదర్శన్ గౌడ్, భూమన్న, కృష్ణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి జిల్లా సహాయ కార్యదర్శి దాసు మాట్లాడారు. మహిళలను గౌరవించే సంస్కృతిని పాఠ్యంశాల్లో పొందుపరచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకురాలు మహ్మది, గంగక్క, నర్సవ్వ, లక్ష్మి, కాలేదా, షహదా, ఫాతిమా బేగం, శివ కుమార్, పాషా, ఇర్ఫాన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ పీవోడబ్ల్యూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సంఘ ప్రతినిధులు రేహానాబేగం,అరుణ, విజయ, లక్ష్మి ,యాదమ్మ, గంగామణి, బుజ్జి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బొప్పాపూర్‌లో మహిళలను సన్మానిస్తున్న నాయకులు



బోధన్‌లో మాట్లాడుతున్న నాగమణి



మామిడిపల్లిలో మాట్లాడుతున్న దాసు

కుటుంబాల తగాదాను రాజకీయం చేయొద్దు



మాట్లాడుతున్న నాయకులు

మోర్తాడ్: ఏర్గట్లలో రెండు కుటుంబాల మధ్య ఉన్న తగాదాను బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఏర్గట్ల మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, నాయకుడు జీవన్‌రెడ్డి మాట్లాడారు. జైనొద్దీన్ అనే బీఆర్‌ఎస్ నాయకునిపై దాడి జరిగిన విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జైనొద్దీన్, మునీరొద్దీన్ కుటుంబాల మధ్య మాత్రమే గొడవ జరిగిందని అన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్‌ఎస్ నాయకులకు మింగుడుపడటం లేదని ఆరోపించారు. ఇకనైనా బీఆర్‌ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని పేర్కొన్నారు.

జానకంపేటలో బయటపడిన నంది, శివలింగం



ఎడపల్లి: జానకంపేట శివారులోని అశోక్ సాగర్ చిన్న తూము సమీపంలో ఉన్న ఈత చెట్ల మధ్య శివలింగం, నంది విగ్రహాలు బయటపడ్డాయి. దీంతో ఈత చెట్టు వద్ద ఉన్న విగ్రహాలను గ్రామస్తులు శుభ్రం చేసి పూజలు చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) - 10.25
	శైతాన్ (హిందీ) - 1.15, 7.00
	బాబు (తెలుగు) - 4.15
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) - 12.30, 3.35, 6.40, 9.45

చదువుతో ఏదైనా సాధించొచ్చు

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): చదువుతో ఏదైనా సాధించవచ్చని, ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. చదువు విషయంలో కాంప్రమైజ్ కావద్దని అన్నారు. రెంజల్‌లో రూ. 22 కోట్లతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలికల సంతోషం కోసం గురుకులాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందకు సాగుతున్నట్లు వివరించారు. పాఠశాలకు తన నిధుల నుంచి 25 కంప్యూటర్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

నాసిరకంగా పనులు చేపడితే చర్యలు

పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే నాసిరకంగా పనులు చేపడితే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పనులు సక్రమంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లకు వత్తాసు పలికితే సహించేది లేదన్నారు. పనులపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. అంతకు ముందు రెంజల్ తహసీల్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్, పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, జెడ్పీటీసీ విజయ, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రజితా యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్

భీమ్‌గల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వేసవికాల శిబిరం శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్ హాజరై మాట్లాడారు. సమాజంలో క్రమశిక్షణతో నడుచుకోవాలని, మంచి చేసే స్వభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. చదువు, క్రమశిక్షణ ఈ రెండు ఉంటేనే సమాజంలో మంచి గౌరవం ఉంటుందని అన్నారు. కళాశాలను అభివృద్ధి చేసేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బ్యాచ్ లీడర్లు, ఉత్తమ వలంటీర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అర్చన, హెచ్‌ఎం కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.